ఉపాధిలో ట్రబుల్ క్లిక్

- ఉపాధి హామీ కూలీలకు కొత్త విధానం
- ముఖ ఆధారిత హాజరుతో కూలీలకు నష్టం
- రెండు పూటలా ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిందే..



ఉరవకొండ శివార్లో ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో కూలీలు, జాబ్‌కార్డుల వివరాలు	
2024-25 ఉపాధి పని దినాలు	రూ.43.67 లక్షలు
కూలీల యాక్టివ్ జాబ్‌కార్డులు	1,18,203
యాక్టివ్ కూలీలు	1,97,197

ఉరవకొండ: కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) యాప్ విధానంతో ఉపాధి కూలీలకు నష్టం జరిగేలా ఉంది. రోజూ కూలీల ఫేస్ రికగ్నైజేషన్ చేసి హాజరు తీసుకుంటారు. గతంలో పనికి ఆలస్యంగా వచ్చినా, ముందు వచ్చినా సమానంగా కూలీ తీసుకునేవారు. దీంతో హాజరు విధానం దుర్వినియోగమవుతోందని కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి వెళ్లింది. దీంతో ఇలాంటి మోసాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టారు. ఉపాధిహామీలో కొత్తగా ప్రవేశపెట్టిన హాజరు విధానాన్ని గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయి కమిషనర్ వరకూ తనిఖీలు చేయాలి. తీసిన ఫొటోను మండల స్థాయిలో అధికారుల ఆదేశాల మేరకు డీఆర్‌డీఏకు, కలెక్టర్‌కు పంపించాల్సి ఉంటుంది. ఉదయం 6 గంటలకు మొదటి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే నాలుగు గంటల తర్వాత 10 గంటలకు మరోసారి ఫొటోను అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. అలా చేయకపోతే రోజు వారి కూలీలకు నగదు చెల్లింపులు ఉండవు.

వ్యతిరేకిస్తున్న కూలీలు

ఉపాధి హామీ నూతన హాజరు విధానాన్ని కూలీలు వ్యతిరేకిస్తున్నారు. రెండు పూటలా ఫొటోలు తీయాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని చెప్తున్నారు. ఈనిబంధనలను అటు కూలీలతో పాటు ఉపాధి హామీ సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు. ఈకొత్త హాజరు విధానంతో ఉపాధి పనులకు హాజరయ్యే వారిశాతం తగ్గిపోయే అవకాశం ఉందని కూలీలు ఆందోళన చెందుతున్నారు.

రెండుసార్లు హాజరుతో నష్టం



రెండుసార్లు ముఖ ఆధారిత హాజరుతో కూలీలకు నష్టమే. ఉదయం ఒకసారి కూలీ ఫొటో తీస్తే ఎలాంటి నష్టం ఉండదు. కానీ రెండు సార్లు ఫొటో అంటే కూలీలు మళ్లీ పని ప్రదేశానికి వచ్చి ఫొటో దిగాలంటే ప్రయాస ఉంటుంది. కేంద్రం ఇలాంటి యాప్‌లు ప్రవేశపెట్టే బదులు కూలీలకు 14 రోజుల్లో పని చేసిన కూలీ సొమ్ము అందించి, ఉపాధి కూలీను రూ.700కు పెంచాలి. క్షేత్రస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం, అనంతపురం

కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం

ప్రతి గ్రామానికీ వెళ్లి ఉపాధి కూలీలకు సమావేశం నిర్వహించి, ఉపాధి హామీ పథకంలో పనులు నాణ్యతగా చేయాలి. రోజుకు రెండు ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచిస్తున్నాం.

– విమల, ఏపీఓ, వజ్రకరూర్

శిక్షణ పూర్తి చేశాం



ఇప్పటికే ఉపాధిహామీ క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం. ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు మేట్లకు ఫొటో తీయడం జరుగుతుంది. దీని వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. పని ప్రదేశాల్లో అవకతవకలకు అవకాశం ఉండదు.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

క్లుప్తంగా

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని శ్రీనివాస కల్యాణమంటపంలో ముదిగల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి కుమారుడు వివాహం గురువారం జరిగింది. ఈ వేడుకకు కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేడుకల్లో రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, యువజన విభాగం రాష్ట్ర నేత రామాంజనేయులు, కౌన్సిలర్లు లక్ష్మన్న, రాము, మండల కన్వీనర్ గోళ్ల సూరి, నాయకులు మురళి, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

'మ్యాజిక్ డ్రైన్'తో దోమలకు అడ్డుకట్ట

- డ్వామా పీడీ సలీం బాషా



ముద్దలాపురంలో మ్యాజిక్ డ్రైన్ ఏర్పాటుకు రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీం బాషా

కూడేరు: మ్యాజిక్ డ్రైన్ నిర్మాణంతో మురుగు నీటిని దుర్వాసన రాకుండా, దోమలు వృద్ధి చెందకుండా అడ్డుకట్ట వేయొచ్చని డ్వామా పీడీ సలీం బాషా అన్నారు. గురువారం మ్యాజిక్ డ్రైన్ నిర్మాణం పైలట్ ప్రాజెక్ట్ కింద డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు డ్వామా పీడీ సలీం బాషా అరవకూరు, ముద్దలాపురం గ్రామాల్లో పర్యటించారు. వీధుల్లోని రోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ డ్రైన్ నిర్మాణంతో తక్కువ ఖర్చుతో మురుగు నీటి సమస్య పరిష్కరించొచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, ఏపీఓ పోలేరయ్య, ఈసీ రాజేష్, టీఏలు కోమల, మంజునాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగ శివలీల

కూడేరు: మీసేవలో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ నాగ శివలీల హెచ్చరించారు. కూడేరులోని మీ సేవ కేంద్రంలో పాన్‌కార్డు చేసేందుకు ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారని కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం డీఎల్‌డీఓ నాగశివ లీల మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, విచారణ చేశారు. సిటిజన్ చార్టర్, ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచారా..లేదా అని సేవల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా ప్రజలకు సేవలందించాలని ఆమె ఆదేశించారు. తర్వాత సచివాలయం-1,2 కార్యాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ పోలేరయ్య, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు రక్షణ కరువు



ప్రసాద్‌నాయక్‌ను పరామర్శిస్తున్న ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులునాయక్

ఉరవకొండ: కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనులకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ జిల్లా విభాగం అధ్యక్షులు శ్రీనివాసులు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వడిత్యాగోవిందనాయక్ ధ్వజమెత్తారు. గురువారం ఉరవకొండ మండలం లత్తవరం తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం మండల అధ్యక్షులు ప్రసాద్‌నాయక్‌ను అనంతపురం సవేరా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ లత్తవరం తండాకు చెందిన టీడీపీ కార్యకర్త తులసీనాయక్ విచక్షణ రహితంగా వైఎస్సార్‌సీపీ గిరిజన నేత ప్రసాద్‌నాయక్‌ను కొట్టి అపస్మారక స్థితిలో వెళ్లేలా చేశారన్నారు. ఘటన జరిగి రెండు రోజులు అవుతున్నా ఉరవకొండ పోలీసులు దీనిపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు దాడి చేసిన తులసీనాయక్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గోవింద్‌నాయక్ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో గిరిజనుల పై దాడులు సిగ్గుచేటన్నారు. మంత్రి కేశవ్, పయ్యావుల శీనప్పల ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నాయన్నారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ నాగరాజునాయక్, సుంకేనాయక్, బాబు, రమేష్ ఉన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించండి



కంబదూరు మండలంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: చంద్రబాబు ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలని కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. గురువారం కంబదూరు మండల పరిధిలోని రాళ్ల అనంతపురం, మద్రిమాకుల పల్లి పంచాయితీల్లో బాబు షూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన వల్ల పేద, మధ్య తరగతి జీవితాలు చిన్నాభిన్నమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కూటమి ఎమ్మెల్యే సురేంద్రబాబు అధికారం చేపట్టిన ఏడాది లోపే పూర్తి చేస్తామన్న బీటీపీని ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లో విచ్చల విడిగా మద్య మాఫియా సాగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, జెడ్పీటీసీ గుద్దెల నాగరాజు, జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షులు బొమ్మయ్య, ఎంపీపీ లక్ష్మిదేవి కుమారుడు బీమేష్, మండల కన్వీనర్లు హనుమంతురాయుడు, వెంకటప్ప, గోళ్ల సూరి, మండల కో ఆప్షన్ మెంబర్ ఫయాజ్, సర్పంచ్ బాబుజీ, పాతలింగ, నాయకులు అదెప్ప, శ్యామంతు, చెన్నంపల్లి, మల్లారెడ్డి, గోవిందప్ప, కిరీటీ, రవీంద్ర రామప్ప, శంకర్‌రెడ్డి, బయ్యన్న దిలీప్, బాబుజీ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే ఆర్డీటీ లక్ష్యం



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

సెట్టూరు: మహిళల ఆర్థిక ఎదుగుల లక్ష్యంగా ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ పని చేస్తుందని సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాంఛో ఫెర్రర్ పర్యటించారు. మహిళా సంఘాలు, ఆర్డీటీ పరిరక్షణ సమితి జేఏసీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా పాధర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఉజ్వల మహిళ కోఆపరేటివ్ బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంక్ నిర్వహణ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అక్కడ 188 మంది మహిళలకు రూ. 57.10 లక్షల చెక్కులను ఉజ్వల బ్యాంక్ ద్వారా రుణాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు తమ పొదుపు ఉజ్వల బ్యాంక్‌లో డిపాజిట్స్ చేసుకుంటారని, ఉజ్వల బ్యాంక్‌లో పొదుపు ఉన్న మహిళలకు తమ అవసరాల నిమిత్తం బ్యాంకు నుంచి రుణాలు పొందొచ్చన్నారు. మహిళ ఐక్యతగా ఉజ్వల కోఆపరేటివ్ బ్యాంక్ నడుపుకోవడం ద్వారా రుణాల కోసం బయటి వ్యక్తుల సాయం కోరాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో మహిళలు పాధర్ ఫెర్రర్ ఆశయాలను పాటించాలన్నారు. ఇతరులకు సహాయం చేయడం అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, ఏటీఎల్ సుశీలమ్మ, ఆర్డీటీ పరిరక్షణ సమితి జేఏసీ సభ్యులు ఎమ్మెస్ రాయుడు, లింగప్ప, ఈరన్న, శ్రీరాములు, బాబురావు, గౌరయ్య, నాగేంద్ర, త్రిమూర్తి, సీటీటీ వన్నూరుస్వామి, ఆనంద్, అనీల్, మల్లికార్జు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



రాయదుర్గంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు

సాక్షి నెట్‌వర్క్: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు గురువారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలన్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతర ం ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

అర్హుల పింఛన్లు తొలగిస్తే ఊరుకునేది లేదు



మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

రాయదుర్గం: అర్హులైన దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తే ఊరుకునేది లేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడారు.. ఏ పనిచేయలేక పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న పేదలపై కూటమి సర్కార్ కన్నెర్ర చేయడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో కుదించేలా చేస్తున్న కుట్రలు మానుకోవాలని హితవు పలికారు. ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో దివ్యాంగుల పింఛన్లు తొలగించలేదన్నారు. పింఛన్ టెన్షన్‌తో దివ్యాంగులు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. దివ్యాంగులు, శారీరక, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు జిరాక్సులు పట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. ఉన్న వాటిని తొలగిస్తేకాని కొత్త పింఛన్లు ఇవ్వలేని దుస్థితిలో కూటమి సర్కార్ ఉందని విరుచుకుపడ్డారు. రీవెరిఫికేషన్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తుండడం దారుణమని మండిపడ్డారు. అర్హుల పింఛన్లు ఒక్కటి తొలగించినా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.



బ్రహ్మసముద్రం ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న దివ్యాంగులు

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం

బ్రహ్మసముద్రం : పింఛన్ల తొలగించడం దారుణమని దివ్యాంగులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు 241 పింఛన్‌దారులను అనర్హులుగా గుర్తిస్తూ నోటీసులు జారీ చేశారన్నారు.

కూడేరు: తొలగించిన అర్హుల పింఛన్లు పునరుద్ధరించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా పింఛన్ పొందుతున్న వారి లబ్ధిదారులను వెరిఫికేషన్ పేరిట కూడేరు మండలంలో కూడా సుమారు 137 వరకు తొలగించారని, వాటిని రెగ్యులర్ చేయాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామిని కలిసి వినతి పత్రం అందించారు.

సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: నిత్యావసర సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం తగదని తహసీల్దార్ మునివేలు హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడినట్లు ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ నెల 26 నుంచి 65 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దకే రేషన్ అందించాలని చెప్పారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులను తెరిచి, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి

గుమ్మఘట్ట: రేషన్‌కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రజాక్‌వలీ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీటీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలపై ఫిర్యాదు



రేషన్ బియ్యం సరఫరాలో అవినీతిపై తహసీల్దార్‌తో మట్లాడుతున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యం పంపిణీలో టీడీపీ నాయకులు, డీలర్లు అవినీతికి పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోళ్ల సూరి, పార్టీ నేతలతో కలిసి గురువారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం మండల కన్వీనర్ గోళ్ల సూరి మాట్లాడుతూ ఎర్రంపల్లి గ్రామంలో 70 కుటుంబాలకు చెందిన రేషన్ పంపిణీలో ఒక్కో కుటుంబం నుంచి 5 కేజీలు తక్కువగా లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. డీలర్‌ను గ్రామస్తులు నిలదీయడంతో తాను ఎమ్మెల్యే అనుచరుడినని, ఎవరూ ఏమి చేయలేరని రెచ్చిపోయాడన్నారు.

పెన్నహోబిలంలో ప్రణయ్ దంపతుల పూజలు



పెన్నహోబిలం లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న ప్రణయ్‌రెడ్డి, రోహితారెడ్డి

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు పార్టీ యువజన విభాగం రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్ రెడ్డి, సతీమణి వై.రోహితారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. నూతన వధూవరులకు ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ద్వారకా నాథాచార్యులు, మయూరం బాలాజీస్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం యువనేత ప్రణయ్‌రెడ్డి దంపతులు లక్ష్మీనృసింహస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు నూతన దంపతులను మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించారు. అనంతరం ఉద్భవ లక్ష్మీదేవి అమ్మవారిని వారు దర్శించుకున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

ఎన్‌సీసీ క్యాడెట్ దొర నందిని ప్రతిభ



ఎన్‌సీసీ క్యాడెట్ దొరనందిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాయదుర్గంటౌన్: విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ గౌరవ వందన కార్యక్రమంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ దొర నందిని పాల్గొనడం గర్వకారణమని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని దొరనందినిని ప్రిన్సిపాల్,అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌సీసీ సీటీవో బాల నరసింహులు, అధ్యాపకులు ఫరీసా ఫిర్దోస్, గురుమూర్తి, కిరణ్ జక్కుల, ప్రసాద్, దొడ్డ నాగప్ప, నారాయణ, పాలరాజ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలి

రాయదుర్గంటౌన్: పట్టణ జనాభాకనుగుణంగా మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచి ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వేణుగోపాలస్వామి గుడి ఆవరణలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ పట్టణ మహాసభ జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షుడు నాగరాజుతోపాటు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడారు. రాయదుర్గం పురపాకల సంఘంలో జనాభాకు అనుగుణంగా కార్మికులు లేకపోవడం తీవ్ర ఇబ్బందులు ఎదువుతున్నట్లు చెప్పారు.

కార్మికుల నూతన కమిటీ ఎన్నిక :

రాయదుర్గం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సీఐటీయూ నాయకుడు మల్లికార్జున, అధ్యక్ష, కార్యదర్శులుగా హెచ్.నాగరాజు, హెచ్.రాము, ఉపాధ్యక్షులుగా వన్నూరప్ప, రమేష్, మైలారి, సహాయ కార్యదర్శులుగా తిప్పేస్వామి, మల్లేష్‌తోపాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

వైభవంగా జైనబ్బీ అమ్మవారి ఉరుసు



చాదర్‌ను ఊరేగింపుగా తెస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: ప్రసిద్ధి గాంచిన హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లా నలమూలల నుంచే కాక కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరుబాషా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అమ్మవారికి చాదర్ బహూకరణ

ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, యువనేత ప్రణయ్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో అమ్మవారికి చాదర్‌ను భారీ ఊరేగింపు నడుమ బహూకరించారు. చాదర్ సమర్పించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు బెలగల్‌షమ్ము, జీఎంఎస్ మీరంబాషా, జిలాన్, వన్నూర్‌సాబ్, మైనుద్దీన్, ఇర్ఫాన్‌బాషా, మహబూబ్‌బాషా, వైఎస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకులు బసవరాజు, కురుబ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మురాద్‌షావలి ఉరుసు

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులో గురువారం సాయంత్రం భక్తుల కొంగు బంగారం హజరత్‌సయ్యద్ మూరాద్‌షావలి 388వ ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఉరుసు మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్వామి సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం జియారత్ కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వాహనాల తనిఖీ

విడపనకల్లు: మండల పరిధిలోని 42వ జాతీయ రహదారిలో ఎస్ఐ ఖాజాహుస్సేన్ గురువారం వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని,రోడ్డు నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలని వాహనచోదకులకు సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే డ్రైవర్లకు జరిమాన వేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలో 2025-28 సంవత్సరానికి బార్ నిర్వహణకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ సోమశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బార్లు వేలం పద్ధతిలో కాకుండా డ్రా తీసి కేటాయించనున్నట్లు తెలిపారు. 26వతేదీ సాయంత్రంలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. బార్ లైసెన్స్ పొందిన వారు రెస్టారెంట్ నిర్వహించుకోవచ్చన్నారు. దరఖాస్తులను అనంతపురంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రాయదుర్గం: రాయదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని చుట్టూ 3 కిలోమీటర్ల వ్యవధిలో బార్ ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో బార్ ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఈ నెల 26వ తేదీలోపు ఆసక్తి కలిగిన వారంతా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నూతన బార్ లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు కాగా, దరఖాస్తు రుసుము రూ.5 లక్షలు ఉంటుందన్నారు. లైసెన్స్ ఫీజు ఆరు వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారంతా స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దామోదర, హెడ్‌కానిస్టేబుల్ హరియన్న, సిబ్బంది కవీంద్ర, లాలు, మహిళా కానిస్టేబుళ్లు, మద్యం వ్యాపారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గుమ్మఘట్ట: గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు క్రమం తప్పకుండా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. గురువారం కలుగోడు ,పూలకుంట గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.

24న రక్తదాన శిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ఈనెల 24న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సంచాలకురాలు బీకే యోగీశ్వరి తెలిపారు. ఈ మేరకు గురువారం బ్రహ్మకుమారి సంస్థలో పోస్టర్లు విడుదల చేశారు. బ్రహ్మకుమారీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ దాది ప్రకాష్ మణిజీ పవిత్ర స్మరణార్థం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సురేంద్రబాబు అన్నారు. గురువారం పట్టణంలోని నూతన ఎన్జీవో భవనాన్ని ఎమ్మెల్యే, ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యా సాగర్, కార్యదర్శి రమణ, ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యోగులు సంఘం నాయకలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి మరువలేనిది

గుమ్మఘట్ట: పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని రాయదుర్గం ఎంఈఓ నాగమణి, ఎంఈఓ-2 రామచంద్ర తెలిపారు. మండలంలోని మారెంపల్లిలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన శ్రీరాములు, కుళ్లాయప్పనాయక్‌ను గురువారం సన్మానించారు. వారు మాట్లాడుతూ పాఠశాలను తమ సొంత పాఠశాలగా భావించి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన వారి సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ప్రేమనాథ్‌రెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు, ఈశ్వరి, నాగమంజుళ, మురళీ, ఎంపీటీపీ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వసంతోత్సవం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో భక్తుల కొంగు బంగారం ఆది చెన్న కేశవస్వామి రథోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం వసంతోత్సవ వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకం, పల్లకీసేవ, వసంతోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం రాత్రి భూదేవి, లక్ష్మమ్మదోపులు, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య, క్లర్క్ లాలేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వజ్రకరూరు సర్పంచుకు సన్మానం

వజ్రకరూరు: స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం మేజర్ పంచాయతీ సర్పంచు మోనాలిసాను స్థానిక కేవీజేడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. ఇటీవల భారత నాణ్యత మండలి దేశంలోని సర్పంచులకు ఆన్‌లైన్‌లో నిర్వహించే సర్పంచ్ సంవాద్ పోటీల్లో వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచు ఎం.మోనాలిసా జాతీయ స్థాయిలో జూలై మాసానికి మొదటి స్థానంలో నిలిచారు. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయత్ అనే అంశం మీద తన ఆలోచనలను పం చుకుని రూ. 35 వేల నగదు బహుమతికి ఎంపికయ్యారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష

ఉరవకొండ రూరల్: మండలం పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో ఉట్ల పరుష గురువారం ఉత్సాహంగా సాగింది. ముందుగా పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులకు ఉట్లమాను ఎక్కే పోటీలను నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్ల మాను పరుషను ఆసక్తిగా తిలకించారు.